

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,29,791లు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



విజయ దుందుభి

- 8లో

భానుడి భగభగలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గత వారం రోజులుగా ఎండ తీవ్రత విపరీతంగా పెరిగింది. ఉదయం 9గంటలకే భానుడు ప్రతాపం చూపిస్తుండగా.. సాయంత్రం 5గంటలైనా పరిస్థితి మారడం లేదు. దీనికి తోడు ఉక్కపోతతో జనం అల్లాడి పోతున్నారు. ఆదివారం పర్లాకిమిడిలో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు వడగాల్పులు తోడు కావడంతో ప్రజలు రాకపోకలకు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

న్యూస్‌రీల్

కొరాపుట్‌లో పురంధేశ్వరి పర్యటన నేడు



దగ్గుపాటి పురంధేశ్వరి

కొరాపుట్: భారతీయ జనతాపార్టీ జాతీయ సాధారణ కార్యదర్శి, పార్టీ ఒడిశా వ్యవహారాల ఇన్‌చార్జి దగ్గుపాటి పురంధేశ్వరి సోమవారం నుంచి కొరాపుట్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు రోడ్డు మార్గంలో సుంకి మీదుగా రాష్ట్రంలో ప్రవేశించనున్నారు. అక్కడి కార్యకర్తలతో సమావేశం కానున్నారు. దొలయిగుడ వద్ద వికాష్‌తీర్థ్ కార్యక్రమం, భారతమాల ప్రాజెక్టులో భాగంగా కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం నుంచి రాయిపూర్ వరకు నిర్మిస్తున్న 6లైన్ల ఎకనామిక్ కారిడార్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. అనంతరం కొరాపుట్, జయపురం పట్టణాల్లో కార్యకర్తలు, వ్యాపారవేత్తలు, బీజేడీ సోషల్ మీడియా ఇన్‌చార్జిలతో సమేకం అవుతారు. మంగళవారం ఉదయం లక్ష్మీపూర్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని, అక్కడి నుంచి రాయగడ జిల్లా పర్యటనకు వెళ్తారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి, తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహా జన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా పురంధేశ్వరి పర్యటన సాగనుందని బీజేపీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్ వివరించారు.

275 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో గంజాయితో నిందితులు

బరంపురం: కొందమాల్ జిల్లా బల్లిగుడా పోలీసులు కారులో బరంపురం వైపు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేయగా, 6 బస్తాల్లో 275 కిలోల గంజాయి పట్టుబడిందని ఐఐసీ అధికారి తపస్‌కుమార్ నాయక్ తెలిపారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

విద్యార్థిని మృతిపై దర్యాప్తు ప్రారంభం



బెత్తగుడ జవహర్ నవోదయ విద్యాలయం వద్ద బాధిత కుటుంబ సభ్యుల నిరసన(ఫైల్)

పర్లాకిమిడి: జిల్లా కేంద్రానికి సమీపంలోని బెత్తగుడ జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థిని సాధామిని రైతో 65 రోజుల క్రితం అనుమానాస్పదంగా ఉరి వేసుకుని మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై విచారణను భువనేశ్వర్ నుంచి వచ్చిన క్రైమ్ శాఖ అధికారులు ఆదివారం ప్రారంభించారు. బెత్తగుడ జేఎన్‌వీ క్యాంపస్‌ను సందర్శించి, ప్రిన్సిపాల్ పండా నుంచి వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థినుల హాస్టల్‌ను తనిఖీ చేశారు. కేసుపై రెండు రోజుల క్రితం కలెక్టరేట్ వద్ద విద్యార్థిని కుటుంబ సభ్యులు, సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టగా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ క్రైమ్‌శాఖ దర్యాప్తుకు హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులు విచారణ ప్రారంభించడంతో.. ఎట్టకేలకు కేసులో పురోగతి కనిపించింది.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగో

రాయగడ: వివిధ స్వచ్ఛంద సేవాసంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగో సూచించారు. గుణుపూర్‌లోని బిజూ పట్నాయక్ కల్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఇటువంటి సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ప్రజాసంక్షేమం కోసం స్వచ్ఛంద సంస్థలు తరచూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం ఆయన కూడా స్వయంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నీలకంఠ సాహు, కార్యదర్శి నికుంజ పాత్రో, బాబా ప్రసాద్, ఉమా పట్నాయక్ తదితరులు పర్యవేక్షనలో జరిగిన శిబిరంలో విశాఖపట్నానికి చెందిన వైద్యులు పాల్గొన్నారు.

● పరుగో పరుగు..



మల్కన్‌గిరి జిల్లాలోని బలిమెల ఎన్‌పీసీలో 88బెటాలియన్‌కు చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్లు ఆజాదీ కా అమృతోత్సవాల్లో భాగంగా మినీ మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బలిమెల పవర్ హౌస్ నుంచి మినీస్టేడియం వరుకు జరిగిన ఈ కార్యక్రమాన్ని బెటాలియన్ కమాండర్ వినోద్ సోరన్ జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో బీఎస్‌ఎఫ్ జవాన్లతో పాటు వందలాది మంది స్థానిక యువత పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బలిమెల ఐఐసీ రఘునాథ్ మాఝి, జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

– మల్కన్‌గిరి

● ప్రతిభకు పదును..

పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు రాయగడ సాయిప్రియ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం, చెట్లను నరకవడం వల్ల కలిగే దుష్పరిణామాలు, అనర్థాలపై విద్యార్థులు తమ ఆలోచనలను చిత్రాల రూపంలో ప్రదర్శించారు. ఇందులో సుచిత్ర హియాల్ ప్రథమ, డి.శిఖసీత వల్లి ద్వితీయ, హిమాంశు శేఖర్ మిశ్రో తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి దయానిధి ఖడంగా పరివేక్షించారు. – రాయగడ



● పడేసి.. పట్టించుకోరు..



పేరుకు జిల్లా కేంద్రమే అయినా.. పర్లాకిమిడి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడికక్కడే చెత్త, తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. పాత ఇనుప స్తంభాలు స్థానంలో విద్యుత్‌శాఖ సిమెంట్ స్తంభాలకు లైన్లు వేశారు. అయితే పాత వాటిని ఎక్కడపడితే అక్కడ పడేయడంతో బాటసారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి వార్డులో దాదాపు ఇదే పరిస్థితి కనిపించడంతో స్థానికులు పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించారు. తుప్పు పట్టిన ఇనుప స్తంభాలను టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థకు చెందిన సబ్ స్టేషన్‌కు తరలించాలని కోరుతున్నారు.

– పర్లాకిమిడి

అభాగ్యులకు.. అన్నీ వారే!



మృతులకు తలనీలాలు ఇస్తున్న బహనాగా గ్రామస్తులు

- బహనాగా బజార్ రైలు ప్రమాదంలో గుర్తించని మృతదేహాలెన్నో
- వారందరికీ సామూహికంగా దశ దిన కర్మ నిర్వహించిన గ్రామస్తులు

కొరాపుట్: బాలేశ్వర్ జిల్లా బహనాగా బజార్ రైలు ప్రమాదం దుర్ఘటనలో మరో మానవీయ కోణం వెలసింది. ప్రమాదం జరిగిన నిమిషాల్లోనే రైలు వద్దకు చేరుకొని, బాధితులను అదుకున్న గ్రామస్తులు.. ఘటన జరిగి 10 రోజులు కావస్తున్న నేపథ్యంలో ఆదివారం దశ దిన కర్మకాండ నిర్వహించారు. ఈ ప్రమాదంలో దాదాపు 288మందికి పైగా మృతి చెందగా, వివరాలు గుర్తించిన పలువురు కుటుంబ సభ్యులు తమవారి మృతదేహాలను స్వస్థలాలకు తరలించారు. అయితే ఇప్పటికీ చాలా మృతదేహాల గుర్తింపు పూర్తి కాలేదు. వారికి సంబంధించిన వారెవరూ ముందుకు రాలేదు. గుర్తించిన వారికి ఎలాగూ వారి బంధువులు కర్మకాండలు నిర్వహిస్తారు. అయితే.. మిగిలిన మృతదేహాల విషయం ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఘటన జరిగిన బహనాగా బజార్ రైల్వేస్టేషన్ పరిధి గ్రామస్తులు ముందుకు వచ్చారు. మృతులను తమ వారిగా భావించి.. భారీ సంఖ్యలో కేశఖండన చేయించుకున్నారు. మరికొందరు కేశఖండన చేయించుకున్న వారికి నూతన వస్త్రాలు పంచి పెట్టారు.

15వేల మందికి అన్నదానం..

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఘటన జరిగినప్పుడు తమంతా క్షణాల్లో రైలు వద్దకు చేరుకొని, క్షతగాత్రులను రక్షించామన్నారు. అలాగే చాలామంది తమ ఫోన్ల ద్వారా వారి బంధువులకు సమాచారం ఇచ్చారన్నారు. అంతేకాక యుద్ధ ప్రాతిప్రదికన బోగీల్లో ప్రయాణికులను బయటకు తీయడం ద్వారా కొందరి ప్రాణాలు రక్షించగలిగామని తెలిపారు. అయితే ఇప్పటికీ చాలా మృతదేహాలను తీసుకు వెళ్లేందుకు గుర్తింపు సమస్యగా మారిందన్నారు. అందుకే మృతులు ఏ మతం వారైనా సరే.. తామంతా దశ దిన కర్మ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం 11వ కర్మ నిర్వహిస్తామని, ఇందులో భాగంగా 5008 దీపాలతో మృతులకు నివాళులర్పించడంతో పాటు భారీ గాయత్రీ యజ్ఞం, సుమారు 15వేల మందికి అన్నదానం జరిపేందుకు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు సమీప ప్రాంతాల ప్రజలు కూడా తరలి రానున్నారన్నారు. మరోవైపు పెద్ద కర్మకు సంబంధించి తమ బంధువులకు సమాచారం అందిస్తూ.. లేఖలు ప్రచురించారు. తమ ఇంట్లో ఎవరైనా దురదృష్టావశాతు మరణిస్తే ఆచరించే కార్యక్రమాలను యథావిధిగా పాటిస్తున్నామని వివరించారు. గ్రామస్తుల సహృదయాన్ని చూసి చుట్టుపక్కల వారు అభినందిస్తున్నారు.



పెద్ద కర్మకు సంబంధించి ప్రచురించిన లేఖ

ప్రజా సంక్షేమమే ధ్యేయం



మార్కెట్ కాంప్లెక్స్‌ను ప్రారంభోత్సవంలో మంత్రి సరక

- రాష్ట్ర మంత్రి జగన్నాథ సరక

రాయగడ: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, వారి కష్టాసుఖాల్లో పాలుపంచుకుంటుందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని సదర్ సమితి పరిధి కెరడ గ్రామంలో సుమారు రూ.10 వ్యయంతో నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆర్థిక వికాసానికి ప్రభుత్వం సరికొత్త పథకాలను అమలు చేస్తోందన్నారు. యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒడిశా, ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కెరడలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, సర్పంచ్ విజయలక్ష్మీ కోలక, సమితి సభ్యురాలు పీఆర్ లక్ష్మీ, రాయగడ బీడీఓ లక్ష్మీనారాయణ సాబొతొ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి సరక పంచాయతీ కార్యాలయంలో కొద్దిసేపు కూర్చొని, పంచాయతీలో జరగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

ఎంపీని కలిసిన డీసీసీ అధ్యక్షుడు బుల్లు



ఎంపీ సప్తగిరి ఉల్క దంపతులకు మర్యాద పూర్వకంగా అభివాదం చేస్తున్న బుల్లు సాహు

కొరాపుట్: రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి కలిగిస్తున్న కొరాపుట్ కాంగ్రెస్ విబేధాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. అందరి అనుమానాలు నిజం చేస్తూ నూతనంగా నియమితులైన కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బుల్లు సాహు(దుర్గాశంకర్) కొరాపుట్ పట్టణంలో ఎంపీ సప్తగిరి ఉల్కను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎంపీ దంపతులు బుల్లు సాహుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కలిసి పని చేస్తామని, పార్టీని విజయాల బాట పట్టిస్తామని సంయుక్తంగా ప్రకటించారు. మరోవైపు బుల్లు 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడుతూ ఎంపీ ఉల్క కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు కొరాపుట్ లోని చందన్ ఫొఖ్రి వద్దకు మకాం మార్చనున్నారని తెలిపారు. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్‌లో ఉన్న సమస్యలు క్రమంగా సద్దుమణుగుతాయన్నారు. దాదాపు 3 దశాబ్దాలకు పైగా పార్టీకి చేసిన సేవలు, విధేయుతకు లభించిన గౌరవంగా డీసీసీ అధ్యక్ష స్థానాన్ని పేర్కొన్నారు. మరోవైపు ఎంపీ ఉల్క మద్దతుతో బుల్లుకు పదవి దక్కిందనే వదంతులకు ఈ భేటీ బలం చేకూర్చింది.

వేర్వేరు ప్రాంతాల్లో వరుస చోరీలు



తులసినగర్‌లో మహ్మద్ జిలానీ నివాసంలో చెల్లాచెదురుగా పడి ఉన్న సామగ్రి

- రూ.లక్షల విలువైన ఆభరణాలు అపహరణ

బరంపురం: నగరంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న వరుస చోరీలు నగర ప్రజలను భయాందోళనకి గురి చేస్తున్నాయి. ఏఎస్పీ ఆశిష్‌కుమార్ పండా తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి సమయంలో గుసానినువాగం పోలీసు స్టేషన్ పరిధి హిల్‌పట్నా రోడ్డులోని ఎస్ఎంఐటీ గేటు తాళాలు విరగ్గొట్టిన దుండగులు.. లోపలికి ప్రవేశించారు. అందులోని విలువైన సామగ్రి దోచుకొని పరారయ్యారు. ఇదే తరహాలో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి తులసీనగర్ 9వ లైన్‌లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి మహ్మద్ జిలానీ ఇంట్లో ప్రవేశించి, బంగారం, వెండి ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. రెండు ఘటనలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అక్కడికి చేరుకొని, దర్యాప్తు ప్రారంభించారు. సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫుటేజీలను పరిశీలించి, దుండగుల కోసం గాలిస్తున్నారు.



ఎస్ఎంఐటీలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గుసానినువాగం పోలీసులు

పిడుగుపాటుకు 29జీవాలు మృతి



ఘటనా స్థలంలో జీవాల కళేబరాలు

బరంపురం: గంజాం జిల్లాలో హింజిలికాట్ పరిసర ప్రాంతాల్లో పిడుగులు పడి 29 మేకలు, గొర్రెలు మృతిచెందాయి. బాధిత గ్రామస్తులు తెలిపిన సమాచారం ప్రకారం హింజిలికాట్ బ్లాక్ పరిధి సారు పంచాయతీ కొతమాపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి గౌడా.. తన మందను శనివారం గ్రామ శివారులోని లోహరికండి నది తీరానికి మేతకు తీసుకు వెళ్లాడు. సాయంత్రం భారీ వర్షంతో పాటు పిడుగులు పడటంతో 29 మేకలు, గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. దాదాపు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి, ఆదుకోవాలని బాధితుడు, గ్రామస్తులు కోరుతున్నారు.

చచ్చిపోతున్నాం.. బకాయిలు చెల్లించండి

- సేవా పేపర్‌మిల్లు విశ్రాంత శ్రామికుల ఆవేదన

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని గగనాపూర్‌లో ఉన్న సేవా పేపర్‌మిల్లు యాజమాన్యాలు మారినా.. శ్రామికుల బాధలు కన్నీటి గాథలుగానే ఉన్నాయి. బిల్ట్ కంపెనీ నుంచి మిల్లును హస్తగతం చేసుకున్న మదర్ అర్థరిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా విశ్రాంత శ్రామికల కష్టాలను లెక్క చేయడం లేదు. వారికి చెల్లించాల్సిన పింఛన్, గ్రాడ్యుటీ, పీఎఫ్ బకాయిలు ఇప్పటికీ చెల్లించడం లేదు. కార్మిక సంఘం ఎన్ని వినతులు చేసినా, నెలలు తరబడి ఆందోళన చేపట్టినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో విశ్రాంత శ్రామికులు సరైన వైద్యం సైతం పొందలేక ఇప్పటికే 30మందికి పైగా మృతి చెందినట్లు కార్మిక సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదే తరహాలో మరో శ్రామికుడు ధనుర్జయ భాగ్ తన భార్యతో సహా ఆదివారం ఉదయం మండుటెండలో మిల్లు ప్రధాన గేటు వద్ద ధర్నాకు దిగారు. తనకు రావాల్సిన పింఛన్, గ్రాడ్యుటీ బకాయిలను చెల్లించాలని యాజమాన్యాన్ని కోరినా మనసు కరగలేదని వాపోయారు. 2011లో ఉద్యోగ విరమణ చేశానని, అప్పటి నుంచి ఇదే పరిస్థితిని వివరించారు. అప్పులు చేసి అతి కష్టంతో కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నానని, ఇక గత్యంతర లేక నిరసనకు దిగినట్లు చెప్పుకొచ్చారు.

ఈనెల 21న నిరవధిక ధర్నా

ఈ సందర్భంగా విశ్రాంత శ్రామిక సంఘ కన్వీనర్, ప్రముఖ కార్మికనేత ప్రమోద్‌కుమార్ మహంతి మీడియాతో మాట్లాడారు. వెంటనే మిల్లు యాజమాన్యం స్పందించకపోతే ఈనెల 21 నుంచి జయపురం లోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట నిరవధిక ధర్నా చేపడతామని ప్రకటించారు. విశ్రాంత శ్రామికుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు యాజమాన్యానికి, అధికారులకు చెబుతున్నా.. బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సేవా పేపరుమిల్లు గేటు నీడలో విశ్రాంతి తీసుకుంటున్న ధనుర్జయ బాఘ్, అతని భార్య



మిల్లు మేనేజర్ నివాసం ముందు ధర్నా చేస్తున్న ప్రమోద్ మహంతి

క్లుప్తంగా

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

పార్వతీపురం: ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. భామిని, పురోహితునివలస, ములక్కాయవలస, కురుపాం ఆదర్శ పాఠశాలల్లో ఆరవ తరగతి ప్రవేశాలకు పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు. భామిని పాఠశాలలో 147 మంది దరఖాస్తు చేసుకోగా 129 మంది, పురోహితునివలసలో 111 మంది దరఖాస్తు చేసుకోగా 92 మంది హాజరయ్యారు. అలాగే మక్కువ పాఠశాలలో 109 మంది దరఖాస్తు చేసుకోగా 98 మంది, కురుపాం పాఠశాలలో 83 మంది దరఖాస్తు చేసుకోగా 65 మంది హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

నేడు 'తోటపల్లి' నీరు విడుదల



తోటపల్లి ప్రాజెక్టు

పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా సోమవారం సాగునీటిని విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి సాగునీటిని ముందుగానే విడుదల చేసి తొలిత కాలువ పరిధిలోని చెరువులలో నీటిని నిల్వ చేసేలా రైతులను అవగాహన కల్పిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాలువ ద్వారా తొలిత 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి క్రమేపి పెంచుతూ 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది 85 వేల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు.

సండే @ 45°



నిర్మానుష్యంగా పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారి

పాలకొండ రూరల్: వేసవిలో గతంలో ఎన్నడూ లేని విధంగా పాలకొండలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సండే రోజున సూరీడు ఒక్కసారిగా మండిపోయాడు. భానుడి ఉగ్ర రూపంతో ప్రజలు హడలిపోయారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు కూడా ఎవరూ సాహసించలేదు. ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత పెరిగి వడగాడ్పులు వీయడంతో ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరి పోయారు. మరో రెండు రోజులు ఇవే పరిస్థితులు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్ సిబ్బందికి రిక్వెస్ట్ బదిలీలు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్(ఆర్ట్, వర్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్) సిబ్బందికి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయనున్న అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 17 వరకు మాత్రమే స్వయంగా జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. బదిలీ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 23 ఉదయం 10.30 నుండి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. తదుపరి మార్పులు ఉన్నట్లయితే పత్రికా సమాచారం ద్వారా తెలియజేస్తామన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో వివిధ శాఖల్లో కాంట్రాక్ట్ పద్ధతిని పని చేస్తున్న ఉద్యోగులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం పేర్కొంది. ఈ మేరకు స్థానిక సంఘం భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలువురు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తొలిత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 'థాంక్యూ సీఎం సార్' పేరుతో జేజేలు పలికారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న 10 వేల మంది ఆశలు నెరవేర్చారని కొనియాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సీఎం చొరవ తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అందుకు సహకరించిన మంత్రి మండలిలోని మంత్రులతో పాటు జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అత్యధిక సంఘాలు జేఏసీ కలిగి ఉన్న ఎన్జీఓ సంఘం ఉద్యోగుల సంక్షేమం, ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేస్తుందన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు మువ్వల గంగా ప్రసాద్‌రావు, కార్యదర్శి చందక శ్రీనివాసరావు, కోశాధికారి పి.రామలక్ష్మి పాల్గొన్నారు.

తారస్ లారీలో వ్యక్తి అస్వస్థత

సీతానగరం: మండలంలోని రాష్ట్రహదారిలో చెన్నై నుంచి రాయగడవైపు లోడ్‌తో వెళ్తున్న తారస్ లారీలో వ్యక్తి అప్పయ్యపేట వద్ద అస్వస్థతకు గురయ్యాడు. ఈ సమాచారం మేరకు సీతానగరం 108 సిబ్బంది సంఘటనా స్థలానికి వెళాలరు. అయితే అప్పటికే అస్వస్థతకు గురైన టీఆర్ నరేంద్రను చికిత్స నిమిత్తం వేరే వాహనంలో లారీ డ్రైవర్ పార్వతీపురంమన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాడు.



క్రీడాకారులతో ముఖ్య అతిథులు

విజయ దుందుభి

- ముగిసిన ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్ టోర్నీ
- విజేతగా నిలిచిన విజయనగరం రాయల్స్ జట్టు
- వరుసగా రెండవ సారి టైటిల్



టాస్ వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



రన్ చేస్తున్న వైజాగ్ డాల్ఫిన్ జట్టు క్రీడాకారిణులు

విజయనగరం: విజయనగరం వేదికగా జరిగిన ఏపీఎల్ ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్ పోటీల విజేతగా విజయనగరం రాయల్స్ జట్టు నిలిచింది. 8 రోజులుగా ఉత్కంఠ భరితంగా సాగిన టోర్నీలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన విజయనగరం రాయల్స్-వైజాగ్ డాల్ఫిన్స్ జట్ల మధ్య ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో విజయనగరం రాయల్స్ ఘనవిజయం సాధించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో వరుసగా రెండవసారి టైటిల్ ఆక్కించుకున్న జట్టుగా విజయనగరం రాయల్స్ నిలిచింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరిగిన చివరి మ్యాచ్‌ను ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి టాస్ వేసి ప్రారంభించగా..టాస్ గెలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 133 పరుగులు చేసింది. అనంతరం 134 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన విజయనగరం రాయల్స్ జట్టు 19.2 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 137 పరుగులు స్కోరు సాధించి విజేతగా నిలిచింది. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్లు తొలి వికెట్‌కు 5 ఓవర్లలో 30 పరుగుల భాగస్వామం నెలకొల్పడం జట్టు విజయంలో కీలకంగా మారింది. విజేతలకు విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, టోర్నీ బ్రాండ్ అంబాసిడర్ రష్మీగౌతమ్, ఏసీఏ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన విజయనగరం రాయల్స్ జట్టు రూ.6 లక్షలు, రన్నరప్‌గా నిలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టుకు రూ.4 లక్షల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

ఉమెన్స్ క్రికెట్ లీగ్ శుభపరిణామం

దేశంలో మొదటి సారి ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమెన్స్ టీ-20 లీగ్ పోటీలు ప్రారంభించడం మంచి పరిణామమని పురుషులతో సమానంగా స్త్రీలను అన్ని రంగాల్లో ప్రోత్సహించే దిశగా ఏసీఏ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అన్నారు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్‌లో కీలక భూమిక పోషిస్తున్న విజయనగరం క్రికెట్ అసోసియేషన్‌కు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి క్రీడారంగానికి, క్రీడాకారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాబోయే కాలంలో విజయనగరంలో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించేలా ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ అభివృద్ధి చేస్తోందని ఆకాంక్షించారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం తరపున అందిస్తామన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన విజయనగరం రాయల్స్ జట్టుతో పాటు ద్వితీయ స్థానంలో నిలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, కోశాధికారి సీతారామరాజు, నార్త్‌జోన్ అకాడమీ ఛైర్మన్ జీవీ సన్యాసిరాజు, కన్వీనర్ పి.దేవవర్మ, సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, మాజీ క్రీడాకారిణి ఆర్.కల్పన తదితరులు పాల్గొన్నారు.



బౌలింగ్ చేస్తున్న విజయనగరం రాయల్స్ క్రీడాకారిణి



విజయనగరం రాయల్స్, వైజాగ్ డాల్ఫిన్ జట్ల మధ్య హోరాహోరీగా జరుగుతున్న ఫైనల్ మ్యాచ్

కొండంత అక్రమం..!



కొండపైన ఆక్రమణ దారులు చుట్టూ వేసిన గట్టు

- గిరిజన యూనివర్సిటీ ప్రతిపాదిత స్థలం పక్కనే ఆక్రమణ
- రాత్రి సమయంలో గట్లు వేసిన ఆక్రమణ దారులు



కిందన మొక్కలు వేసేందుకు చదును చేసిన స్థలం

దత్తిరాజేరు: మండలంలోని కోరపు కొత్తవలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్-1లో కొండను అక్రమించేందుకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రణాళిక వేయడంతో ఆది కాస్తా బయట పడింది.గిరిజన యూనివర్సిటీ ప్రతిపాదిత స్థలాన్ని ఆనుకుని కొండ ఉండడంతో పాటు జాతీయ రహదారికి కిలోమీటర్ దూరంలో ఉండడంతో ఇక్కడ భూములు ధరలు అమాంతంగా పెరగ్గా ఆక్రమణ దారుల కన్ను కొండపై పడింది.గతంలో జాతీయ రహదారి విస్తరణ పనులకు కంకర తవ్వకాలు జరిగిన ప్రదేశం చుట్టూ రాత్రి సమయంలో జేసీబీ, ట్రాక్టర్లతో చక్కగా గట్లు వేశారు. అంతటితో ఆగకుండా కిందనే ఉన్న మరో రెండెకరాల స్థలంలో మొక్కలు వేసేందుకు చదును చేసి సిద్ధం చేయడం స్థానికుల కంటబడడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమణల బాగోతం బయట పడింది. ఈ విషయమై తహసీల్దార్ రమేష్ వద్ద ప్రస్తావించగా తన దృష్టికి వచ్చిందని వీఆర్వో ద్వారా సమాచారం సేకరిస్తున్నామని ఆక్రమించిన వారు ఎంత వారైనా చర్యలు తీసుకోవడం తప్పదని స్పష్టం చేశారు.

1704 లీటర్ల సారా ధ్వంసం



జేకే పాడు సమీపంలో సారా ధ్వంసం చేయిస్తున్న పాలకొండ డీఎస్పీ కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట సర్కిల్ నీలకంఠాపురం, కురుపాం, ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసుల దాడుల్లో పట్టుబడిన 1704 లీటర్ల సారాను ఎల్విన్‌పేట పోలీసులు మండలంలోని జేకే పాడు గ్రామ సమీపంలో ఆదివారం ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన పాలకొండ డీఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ఎల్విన్‌పేట స్టేషన్ పరిధిలో 239.5 లీటర్ల సారా, కురుపాం స్టేషన్ పరిధిలో 1292.1 లీటర్ల సారా, నీలకంఠాపురం స్టేషన్ పరిధిలో 173 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఈ మూడు స్టేషన్ల పరిధిలో మొత్తం 49 కేసులు నమోదు చేశామని చెప్పారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ కృష్ణారావు హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలజోలికి పోకుండా జాగ్రత్త పడేలా దిశ, జాగృతి పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనతనిఖీలు ముమ్మరంగా చేపట్టడమే కాకుండా సాయంత్రం, రాత్రి వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఐ సత్యనారాయణ, ఎస్సైలు తదితరులున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: తీవ్రమైన కడుపునొప్పిని భరించలేక ఓ మహిళ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం బల్లకృష్ణాపురం గ్రామానికి చెందిన కొల్లి నారాయణమ్మకు కొన్నేళ్లుగా కడుపునొప్పి తరచూ వస్తుంది. ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఇంటిలో ఉన్న చీమలమందు ఆదివారం తాగేసి ఇంట్లో పడి ఉంది. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనం ద్వారా చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నేడు డీఈఈ సెట్

విజయనగరం ఫూల్‌బాగ్: డీసెట్ - 2023 పరీక్ష స్థానిక గాజులరేగలో సీతం కాలేజీలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30వరకు జరుగుతుందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగా హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని పరీక్ష కేంద్రానికి రిపోర్ట్ చేయాలన్నారు.

దిగొచ్చిన వంట నూనె ధరలు



- స్టాంప్ డ్యూటీ తగ్గింపుతో అందుబాటులో ఆయిల్ ధరలు
- వ్యాపారులు రేటు పెంచకుండా ప్రభుత్వం చర్యలు
- పామాయిల్ లీటరు రూ.100
- సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.115



సంతలో విక్రయానికి సిద్ధం చేసిన వంటనూనెలు

సీతంపేట:

మొన్నటి వరకు ఆకాశాన్నంటిన వంట నూనెల ధరలు దిగొచ్చాయి. సామాన్యుడికి అందుబాటులోకి వచ్చాయి. ఆరు నెలల కిందట రూ.200ల వరకు పలికిన లీటరు నూనె ప్రస్తుతం రూ.115-120 మధ్య లభిస్తోంది. సన్‌ఫ్లవర్, సోయాబిన్, రైస్‌బ్రేన్, పామాయిల్ ధరలు తగ్గడంతో సామాన్యులకు భారీ ఊరట లభించింది. కరోనాకు ముందు ఏ రకం ఆయిల్ కొనుగోలు చేసినా లీటరు రూ.100 లోపలే లభించేది. కరో సమయంలో ధరలు భాగా పెరిగాయి. ఆ సమయంలో పామాయిల్ ధరలు లీటరు రూ.170కి చేరింది. సన్‌ఫ్లవర్ రూ.190కి చేరింది. ఇంతలోనే ఉక్రెయిన్, రష్యాయుద్ధం మొదలు కావడంతో నూనెల ధరలు ఆకాశాన్నంటాయి. రూ.200ల మార్క్ ధరకు చేరాయి. వంటనూనెల ధరలతో సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం స్టాంప్ డ్యూటీని గతేడాది ఒకసారి, ఈ ఏడాదిలో ఇటీవల మరోసారి తగ్గించింది. దీనికి తోడు అంతర్జాతీయంగా నూనెల ధరలు తగ్గడం మొదలు కావడంతో దేశంలో ధరలు అదుపులోకి వచ్చాయి. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభు త్వం అయిల్ రేట్లు పెరగకుండా తరుచూ మిల్లుల్లో తనిఖీలు చేయడం, కల్తీలు లేకుండా చర్యలు తీసుకోవడంతో నూనెల ధరలు అందుబాటులోకి వచ్చాయి.

లీటరుపై రూ.70 నుంచి రూ.80 తగ్గింది



ఆరు నెలల నుంచి వంట నూనెల ధరలు తగ్గుతూ వస్తున్నాయి. అంతకముందు ఏ రకం ఆయిల్ కొనుగోలు చేయాలన్నా రూ. 170 నుంచి రూ.200ల వరకు ధర పలికేది. దిక్కుతోచని స్థితిలో కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం వంట నూనెల ధరలు తగ్గాయి. గతంతో పోలిస్తే లీటర్‌పై రూ.70 నుంచి రూ.80వరకు తగ్గింది.

– ఎస్.సుజాత, గృహిణి, అంటికొండ

ప్రభుత్వం ధరలను కట్టడి చేసింది



వంట నూనెల ధరలు పెరగకుండా ప్రభుత్వం కట్టడి చేసింది. భవిష్యత్తులో కూడా పెరిగే అవకాశాలు లేవు. మా గిరిజనులమంతా వారపు సంతల్లో నూనెలు కొనేవాళ్లం. బయటి మార్కెట్ కంటే ధరలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి.

– ఎస్.మంగయ్య, మోహన్‌కాలనీ



వారపు సంతలో వంట నూనె కొనుగోలు చేస్తున్న మహిళలు

సమస్యలకు పరిష్కారం

- సత్ఫలితాలిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం
- ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు
- సమస్యలు విని పరిష్కారం చూపుతున్న వైనం
- శాశ్వత ప్రాతిపాదికన పనులు చేయిస్తున్న జిల్లా యంత్రాంగం
- జిల్లాకు 1396 పనులు మంజూరు కాగా 1224 పనులు ప్రారంభం
- 162 రోడ్లు, కాలువ నిర్మాణ పనులు పూర్తి



బలిజిపేట మండలంలో నిర్మాణం పూర్తయిన రోడ్డు



బలిజిపేట మండలంలో నిర్మాణం పూర్తయిన రోడ్డు

పార్వతీపురం టౌన్: నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో పలు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వ సేవలన్నీ గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తెచ్చే క్రమంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. జిల్లాల్లో 544 వార్డు/గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ముంగిళ్లలోనే ప్రజలకు సేవలందిస్తోంది. ఇక గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా సచివాలయాలు సందర్శిస్తున్నారు. సమస్యలను గుర్తించి అప్పటికప్పుడే నిధుల విడుదలకు సిఫార్సు చేస్తున్నారు. వచ్చిన నిధులతో ప్రాధాన్యత ఆధారంగా పనులు ప్రారంభిస్తున్నారు. ఫలితంగా ఎక్కడికక్కడ సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.

జిల్లాలో పనుల మంజూరు ఇలా...

మండలం	మంజూరైన పనులు	ప్రారంభించినవి	పూర్తి చేసినవి
భామిని	34	29	5
పాలకొండ	44	42	2
పాలకొండ అర్బన్	15	10	0
సీతంపేట	91	82	9
వీరఘట్టాం	73	71	2
గరుగుబిల్లి	43	38	5
గుమ్మలక్ష్మీపురం	85	76	9
జియ్యమ్మవలస	94	94	0
కొమరాడ	75	65	10
కురుపాం	102	71	31
బలిజిపేట	46	40	6
పార్వతీపురం	65	57	8
పార్వతీపురం అర్బన్	107	85	22
సీతానగరం	102	97	5
మక్కువ	65	62	3
పాచిపెంట	128	119	9
సాలూరు	132	98	34
సాలూరు అర్బన్	90	88	2

మౌలిక వసతులకు పెద్దపీట

ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో గుర్తించిన పనుల్లో ఇప్పటి వరకూ 1,507 పనులు మంజూరు కాగా, 1,426 పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన పనులు కూడా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్య, రోడ్ల మరమ్మతులు, మురుగు కాలువల పునరుద్ధరణ, వీధి లైట్ల ఏర్పాటు, పాఠశాల భవన నిర్మాణాలు తదితర మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

అడుగడుగునా బ్రహ్మరథం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. వైఎస్ జగన్ సర్కార్ చేసినంతగా గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు ఆనందంతో చెబుతున్నారు. అడుగడుగునా ఆత్మీయ పలకరింపులు, ప్రజాప్రతినిధులకు ఎదురెళ్లి హారతులు పడుతున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులకు 'గడపగడపలో' ఆత్మీయ స్వాగతం లభిస్తోంది. ఈ కార్యక్రమానికి వచ్చిన వినతుల్లో కొన్నింటిని పరిశీలిస్తే...

- బత్తలపల్లి మండల కేంద్రంలో పాఠశాల భవనం సరిగా లేదని 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ప్రజలు విన్నవించారు. ఆయన ప్రతిపాదనలు పంపగా అధికారులు స్పందించి నిధులు విడుదల చేశారు. ప్రస్తుతం శరవేగంగా పనులు జరుగుతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- మడకశిర మండలం హెచార్ పాళ్యం పాత ఎస్సీ కాలనీలో చాలా రోజులుగా తాగు నీటి సమస్య ఉండేది. పక్క గ్రామానికి వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి. అయితే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి స్థానికులు సమస్య వివరించారు. ఆయన అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం కొత్త పైప్ లైన్ వేసి కుళాయి ఏర్పాటు చేశారు. జగన్ ప్రభుత్వంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో నిధుల మంజూరు రూ.లక్షల్లో...

నియోజకవర్గం	నిధుల మంజూరు (రూ. లక్షల్లో)
పాలకొండ	577.00
కురపాం	813.00
పార్వతీపురం	1131.00
సాలూరు	976.00

ప్రత్యేక సెల్



గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రతిపాదించిన పనులకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాం. సచివాలయాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు విడుదలవుతున్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు వినియోగిస్తున్నాం.

– నిశాంత్ కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

క్లుప్తంగా

14న మెగా జాబ్‌మేళా

ఇచ్ఛాపురం: సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఆధ్వర్యంలో ఈ నెల 14న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ జాబ్‌మేళాను స్థానిక సీబీఎస్ఈ పాఠశాల జ్ఞానభారతిలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో సుమారుగా 16 కంపెనీలు 1300 ఉద్యోగాలను భర్తీ చేయనున్నాయని వివరించారు. ఈ జాబ్‌మేళాలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కమాండింగ్ అధికారి అమిత్ బెనర్జీ

టెక్కలి: దేశ రక్షణ విభాగంలో చేరాలనే యువత ఆలోచనకు మొదటి మెట్టు ఎన్‌సీసీ అని కమాండింగ్ అధికారి అమిత్‌బెనర్జీ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం నుంచి 5 బెటాలియన్లకు చెందిన 731 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గత వారం రోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కమాండింగ్ అధికారి అమిత్ బెనర్జీ చేతుల మీదుగా ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో సుబేదార్ సుభాష్‌చంద్, ట్రెనింగ్ అధికారి నానాజీ, క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ వై.పోలినాయుడు, డి.విష్ణుమూర్తి, టి.సోమేశ్వరరావు, బి.రేవతి, బి.శరత్‌కుమార్, డి.పుష్పలత పాల్గొన్నారు.

ఆదిత్యునికి విశేష పూజలు



సూర్యనమస్కార పూజలను చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణమూర్తిని ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఎండల వల్ల భక్తులు ఇబ్బంది పడ్డారు. అయితే ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సిబ్బంది తగు చర్యలు చేపట్టారు. విశిష్ట, ప్రత్యేక దర్శనాల క్యూలైన్లతో పాటు ఉచిత దర్శనాల క్యూలైన్ల వద్ద మంచినీరు, ఉచితంగా మజ్జిగలను పంపిణీ చేశారు. అలాగే ఆలయంలోపల మండపం వద్ద ఉచిత ప్రసాదాలను అందజేశారు. ఆలయ మండపాల్లోనూ, బయట మండపంలోనూ ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఆలయ పాలక మండలి సభ్యులు ద్వారపు అనూరాధ కుటుంబంతో సహా ఆదిత్యున్ని దర్శించుకుని భక్తులకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం ఒక్కరోజున ఆలయానికి రూ.6,22,719 వరకు ఆదాయం లభించినట్లుగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తెలియజేశారు. వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,51,700, విరాళాలు రూపంలో రూ.56,019, ప్రసాదాల రూపంలో రూ.2.15 లక్షలు వరకు ఆదాయం లభించినట్లుగా చెప్పారు.

క్రీడలకు ప్రాధాన్యత



కబడ్డీ విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఆర్జీయూకేటీ రాష్ట్ర చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ట్రిపుల్ ఐటీ) రాష్ట్ర చాన్స్‌లర్ కేసీ రెడ్డి అన్నారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర ట్రిపుల్ ఐటీ విశ్వవిద్యాలయాల స్పోర్ట్స్ మీట్ ఆదివారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో పురుషులకు క్రీడల పోటీలు నిర్వహించగా, ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ప్రకాశం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ జట్టు విజేతగా నిలిచింది. క్రికెట్ పోటీల్లో ఇడుపులపాయ జట్టు విజేతగా నిలిచింది. ఇక్కడ ఉత్తమ ప్రదర్శన ఆధారంగా ఏర్పాటు చేసిన జట్లను జాతీయ, సౌత్‌జోన్ పోటీలకు పంపిస్తారు. విజేతలకు ట్రోఫీలను అందజేసిన చాన్స్‌లర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి మంచి గుర్తింపు, భవిష్యత్ ఉంటుందని వివరించారు.

బృందావనంలో అష్టమి వేడుకలు

గార: రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు కాలనీ సమీపంలోని బృందావనంలో ఆదివారం అష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ముందుగా శ్రీకృష్ణునికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చౌదరి దుర్గారావు దంపతులు నిర్వహించారు. అనంతరం శ్రీకాకుళం నగరానికి చెందిన సింహాద్రి శ్రీనివాస్ బృందంచే భజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసమే
రాజశ్యామల యాగం

- విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- పెదలింగాలవలసలో ముగిసిన యాగం



యాగ శాలలో పూజలు చేస్తున్న విజయనగరం ఎంపీ చంద్రశేఖర్



మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి

లావేరు: లోక కల్యాణం కోసమే పెదలింగాలవలస గ్రామంలో రాజశ్యామల అమ్మవారి యాగం చేపట్టారని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టరు అప్పలనాయుడు దంపతుల సౌజన్యంతో మూడు రోజులపాటు నిర్వహించిన రాజశ్యామల యాగం ఆదివారంతో ముగిసింది. స్వరూపానందేంద్ర సరస్వతి విచ్చేసి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పలనాయుడు, యశోద దంపతులు స్వరూపానందేంద్ర సరస్వతిని సన్మానించారు. అనంతరం భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బాగుండాలని, వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండాలని, లోక కల్యాణం కోసం తన ప్రియ శిష్యుడైన అప్పలనాయుడు ఎంతో ఖర్చుపెట్టి మూడు రోజుల పాటు వేదపండితులతో రాజశ్యామల యాగం చేపట్టారన్నారు. అతనికి అమ్మవారి అనుగ్రహం ఉంటుందన్నారు. అప్పలనాయుడు దంపతులు చిరస్థాయిగా తన గుండెల్లో నిలిచిపోతారన్నారు. శ్రీకాకుళం జిల్లా తనకు జన్మనిచ్చిన నేల అన్నారు. ఈ జిల్లాలో రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని నిర్మించి ప్రతిష్ట చేయాలన్నదే తన సంకల్పమని వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా ఆర్థికంగా బలమైన ప్రాంతం కాదన్నారు. బలమైన ఆర్థికబలాలు లేకపోయినా గుండె బలం ఉన్న జిల్లా అని వ్యాఖ్యానించారు. ఎవరికైనా సహాయ సహకారాలు అందించాలంటే జిల్లా ప్రజలు ముందుంటారన్నారు. మాయ, మర్మం, కుటిల భావజాలాలు లేని పరమపవిత్రమైన మనస్థత్వంతో కూడుకున్న జిల్లా అన్నారు. విదేశీ మతాలు వద్ద సనాతన హిందూ ధర్మమే మనకు ముద్దు అన్నారు. ఆయన వెంట విశాఖ శారదపీఠం కన్వీనర్ బ్రహ్మశ్రీ ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, వేద పండితులు ఉన్నారు. మధ్యాహ్నం సుమారు 15 వేల మందికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఘన స్వాగతం

రాజశ్యామల యాగంలో పాల్గొనేందుకు విచ్చేసిన స్వరూపానందేంద్ర సరస్వతికి సుభద్రాపురం గ్రామం వద్ద 50 కార్లు, వందలాది ద్విచక్ర వాహనాలతో భక్తులు ఘన స్వాగతం పలికారు. కార్లు, ద్విచక్ర వాహన ర్యాలీతో పెదలింగాలవలసలోని యాగ శాల వద్దకు తోడ్కొని వచ్చారు.

ప్రజాప్రతినిధుల హాజరు..

పెదలింగాలవలసలో జరిగిన రాజశ్యామల యాగానికి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు), రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ బల్లాడ హేమమాలినిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, ఎచ్చెర్ల మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ఒప్పంగి గ్రామానికి చెందిన సివిల్స్ విజేత చల్లా కల్యాణి జిల్లా కీర్తిని పెంచారని రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోని వప్పంగి గ్రామంలో ఆదివారం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను చేరుకోవడం సుసాధ్యమవుతుందని అన్నారు. సమాజం వేగంగా మార్పు చెందాలంటే ఇదొక్కటే మార్గమన్నారు. అందరూ కల్యాణిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఒక గ్రామీణ నేపథ్యంలో ఓ సాధారణ కుటుంబంలో పుట్టి ఉన్నత స్థితికి ఎదగడం ఆమె కృషికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, జెడ్పీ సీఈఓ వెంకటరామన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బారసాలకు వచ్చి వెళ్తుండగా..



లారీను ఢీకొని ప్రమాద స్థలంలోనే మృతి చెందిన లక్ష్మణరావు

లావేరు: మండలంలోని బుడుమూరు గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఆల్తి లక్ష్మణరావు(50) అనే వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా రాజాం మండలంలోని గురవాం గ్రామానికి చెందిన ఆల్తి లక్ష్మణరావు, ఎల్.త్రినాథరావు ఆదివారం ద్విచక్రవాహనంపై లావేరు మండలంలోని రాయిలింగారిపేట గ్రామంలో జరిగిన బారసాల ఫంక్షన్‌కు వచ్చారు. భోజనాలు చేసిన అనంతరం తిరిగి గురవాం వెళ్తుండగా లావేరు మండలంలోని బుడుమూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో లక్ష్మణరావు ద్విచక్రవాహనం పైనుంచి రోడ్డుపై పడి తలకు తీవ్రమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆయన ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. త్రినాథరావు కూడా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సాయంతో క్షతగాత్రుడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. లావేరు స్టేషన్ ఎస్ఐ కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించి రిమ్స్‌కు తరలించారు.

● థాంక్యూ సీఎం సార్



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి కాంట్రాక్టు ఉద్యోగులతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం చరిత్రాత్మకం అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగులంతా థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు, ఎమ్మెల్యే కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 22 ఏళ్లుగా ఏ ముఖ్యమంత్రీ చేయలేని పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. - పాతపట్నం



సర్వే నంబర్ 335లో డీపట్టా భూమిలో క్వారీ నిర్వహణ

గలీజు వ్యవహారం

- డీ పట్టా భూముల్లో యథేచ్ఛగా క్వారీల నిర్వహణ
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పేలుళ్ల నిబంధనలు పాటించని వైనం

పొందూరు: మైనింగ్ క్వారీల విషయంలో అక్రమార్కులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నూతన విధానాలు రూపొందించినా వాటిని బేఖాతరు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. పొందూరు మండలంలోని రాపాక, ఇల్లయ్యగారిపేట, కృష్ణాపురం, వావిలపల్లిపేట తదితర గ్రామాల్లో నల్ల రాయి కొండలు, వాటిలో క్వారీలు విస్తరించి ఉన్నాయి. వాస్తవానికి క్వారీల నిర్వహణకు గతంలో మైనింగ్ లీజు అనుమతులతో పాటు క్వారీలలో పేలుళ్లకు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. కానీ మండలంలో చాలా వరకు క్వారీలు ఈ నిబంధనలు పాటించడం లేదు. క్వారీలకు మైనింగ్ లీజు అనుమతులు గానీ, పేలుడు పదార్థాల వినియోగానికి పర్మిషన్లు గానీ వీరి వద్ద లేవు. నిబంధనలను తోసిరాజని అత్యంత ప్రమాదకరమైన డైనమైట్స్, జిలెటిన్‌స్టిక్స్ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. అలాగే అమ్మోనియా వంటి పేలుడు పదార్థాలను సైతం క్వారీలోని నల్లరాయిని పేల్చేందుకు వినియోగిస్తున్నట్లు సమాచారం.

నిపుణులు లేకుండానే..



జిలిటెన్ స్టిక్స్, వైర్లు

క్వారీల్లో పేలుడు పదార్థాలను ఎవరు పడితే వారు వినియోగించడానికి వీల్లేదు. శిక్షణ పొందిన నిపుణులు మాత్రమే క్వారీలలో పేలుళ్లు నిర్వహించాలి. దీనికి విరుద్ధంగా ఈ క్వారీల్లో పేలుడు పదార్థాలు ఇష్టానుసారం వినియోగిస్తుండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. క్వారీల్లో పనిచేసే కార్మికులకు ఎలాంటి భద్రతా పరికరాలు కూడా ఇవ్వడం లేదు. ఏటా పదుల సంఖ్యలో కార్మికులు మరణిస్తున్నా.. క్వారీ నిర్వాహకులు ఈ విషయాలను బయటి ప్రపంచానికి తెలియనివ్వడం లేదు.

అడ్డగోలుగా క్వారీలు..

- పొందూరు మండలంలో లీజులు, ఎలాంటి అనుమతులు లేకుండా 90 శాతం క్వారీలు జరుగుతున్నాయి.
- 335 సర్వే నంబర్ కొండపోరంబోకు సుమారు 49 ఎకరాలు గారపేట సమీపంలో ఉంది. ఇక్కడ కొంత మందికి పట్టాలు ఇచ్చారు. డీపట్టా భూములలో అడ్డగోలుగా క్వారీలు నిర్వహిస్తున్నారు.

విధానం మారినా..

రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకత కోసం నూతన విధానం తీసుకువచ్చింది. కానీ క్వారీ నిర్వాహకులు నూతన విధానాన్ని పాటించకుండా అడ్డదారులనే ఎంచుకుంటున్నారు. ప్రభుత్వం క్వారీలను, మైనింగ్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. ఈ సంస్థలు ముందుగానే ప్రభుత్వానికి సీనరేజ్ చెల్లించి కాంట్రాక్టులు దక్కించుకున్నాయి. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. కానీ ప్రభుత్వానికి సీనరేజ్ కట్టకుండా ఎగ్గొడుతున్న క్వారీ నిర్వాహకులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వ విధానాలు కచ్చితంగా పాటించేటట్లు చేయగలిగితే ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరుతుంది. దీనిపై వీఆర్వో బలరాంతో మాట్లాడుతూ సర్వే నంబర్ 335 కొండపోరంబోకు భూమిలో కొంత మందికి గతంలో పట్టాలిచ్చారని తెలిపారు.

- రెవెన్యూ నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని రాపాక రెవెన్యూ పరిధిలో 335 సర్వే నంబరులో భారీగా క్వారీలు నిర్వహిస్తున్నారు. నెలవారీ అందుతున్న మామూళ్ల కారణంగా రెవెన్యూ, మైనింగ్, పోలీసుశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- సర్వే నంబర్లు 198, 224లో లీజులు, అనుమతులు లేకపోయినా అక్రమ మైనింగ్ జరుపుతున్నారు.

బొంతుపేట వద్ద రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి ఫ్లైఓవర్‌పై కారు పల్టీ
- తెరచుకున్న ఎయిర్ బెలూన్లు
- ఆరుగురికి స్వల్ప గాయాలు



గాయపడిన కుమార్



నుజ్జునుజ్జయిన కారు

లావేరు: బొంతుపేట గ్రామం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్ పైనుంచి వెళుతున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. కారు నుజ్జునుజ్జయినప్పటికీ ఎయిర్ బెలూన్లు తెరచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నానికి చెందిన వై.కుమార్‌తో పాటు మరో ఐదుగురు ఆదివారం ఉదయం కారులో ఒడిశా రాష్ట్రంలోని బరంపురం వద్ద చత్రపురి వెళ్లారు. తిరిగి మధ్యాహ్న సమయంలో విశాఖ వెళ్లే క్రమంలో బొంతుపేట గ్రామం వద్ద ఫ్లైఓవర్ పైనుంచి వెళుతుండగా కారు అదుపుతప్పి జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి అవతలి రోడ్డులో పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆ మార్గంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న వై.కుమార్‌కు చేతిపై గాయమవ్వగా మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లావేరు పోలీసులు ప్రమాద స్థలానికి వచ్చి కారును పరిశీలించి వివరాలు సేకరించారు.

రాజ్యాంగ విలువలను కాపాడాలి

- భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ గోపీనాథ్

టెక్కలి: దేశంలో రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి అన్ని వర్గాలు కలిసి మహోద్యమాన్ని చేపట్టాలని భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.గోపీనాథ్ పిలుపునిచ్చారు. భారత్ బచావో జిల్లా కన్వీనర్ పేడాడ పరమేశ్వరరావు అధ్యక్షతన టెక్కలిలో ఆదివారం జిల్లాస్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో లౌకిక వాదాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యం కావాలన్నారు. మతాలకు కాకుండా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో పరిశ్రమలను కార్పొరేట్ సంస్థల వశం చేశారని దుయ్యబట్టారు. అంతేకాకుండా మూఢత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. భారత్ బచావో రాష్ట్ర కార్యదర్శి దుడ్డు ప్రభాకర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ లక్ష్యాన్ని కాపాడుకోవడానికి దేశ ప్రజలంతా ఏకతాటిపై నడవాలని కోరారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం కోసం ఫాసిస్టు విధానాలను అడ్డుకుంటామన్నారు.

ప్రస్తుత బీజేపీ పాలనలో ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. సదస్సులో రాష్ట్ర నాయకులు గూడురు సీతామహాలక్ష్మి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.వి.జగన్నాథం, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్, సీపీఎం నాయకుడు డి.గోవిందరావు, సీపీఐ నాయకుడు ఎ.షణ్ముఖరావు, న్యూడెమోక్రసీ నాయకుడు వంకల మాధవరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కె.మధుతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎక్కడికక్కడ సారా స్థావరాలపై దాడులు జరుగుతున్నాయి. గంజాయి క్రయవిక్రయాలపై గతం కంటే అధికంగా అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ దాడులు ఇంకా పెంచుతామని, నిషేధిత ఉత్పత్తుల అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికడతామని చెబుతున్నారు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ విజయనాగమణికంఠ. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. – శ్రీకాకుళం క్రైమ్



మత్తు వదిలిస్తాం..

- గంజాయి క్రయవిక్రయాలపై ఉక్కుపాదం మోపుతాం
- మద్యం అక్రమ రవాణా అరికడతాం
- జిల్లా ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ విజయ నాగమణికంఠ

సాక్షి: మీ బాల్యం, విద్యాభ్యాసం, కుటుంబ నేపథ్యం ఏంటి?

అధికారి : మాది ప్రకాశం జిల్లా మార్టూరు. ఇంటర్ వరకు అక్కడే చదివా. నాన్న ఫొటోగ్రాఫర్, అమ్మ గృహిణి. బాపట్లలో (2006–2010) బీటెక్ చదివాను. పోస్టల్ డిపార్ట్‌మెంట్ మొదలుకుని ఏపీ ఎస్ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్, ఎస్‌బీఐ, బ్యాంక్ఆఫ్‌బరోడాలకు పీఓ, నేషనల్ ఇన్సూరెన్సు ఏఓ, ఎస్ఎస్‌సీ టాక్స్ అసిస్టెంట్, యూపీఎస్‌సీ సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, ఏపీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ (గుంటూరు జిల్లా నర్సారావుపేటలో)గానే కాక, ఇండియా ఫారెస్టు సర్వీస్‌కు ఎంపికయ్యాను. ఐఎఫ్ఎస్ శిక్షణ కోసం డెహ్రాడూన్‌లో ఉండగానే సివిల్స్‌లో ఐపీఎస్‌కు ఎంపికై ఏపీ గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా కొన్నాళ్లు పని చేశాను. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్‌పోలీస్‌గా చేశాక 2022 సెప్టెంబరు 3న శ్రీకాకుళం సెబ్ అదనపు ఎస్పీ (జాయింట్ డైరెక్టర్)గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. నా భార్య హర్షిత గ్రూప్–1 అధికారి, విజయనగరం జిల్లా దిశా డీఎస్పీగా ఉన్నారు.

సాక్షి : ఇక్కడ గంజాయి ముఠా కదలికలు ఎలా ఉన్నాయి?

అధికారి : జిల్లాలో గంజాయి సాగు కేంద్రాలు లేవు. ఏఓబీ ప్రాంతాల్లో అక్కడక్కడా ఉన్నా వాటిని కాల్చేస్తున్నాం. ఒడిశా నుంచి ప్రత్యేకంగా వాహనాల్లో, బస్సుల్లో, కొరియర్ ద్వారా వస్తున్న మాల్‌పై రాత్రి, పగటి పూట చెక్‌పోస్టుల్లో విపరీతంగా దాడులు చేస్తున్నాం. 2022 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 142 కిలోల గంజాయి పట్టుబడింది. ఎంత చిన్న మొత్తంలోనైనా పట్టుకుంటాం. యువతకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. కొందరికి కౌన్సెలింగ్ కూడా చేశాం.

సాక్షి : సారా స్థావరాల మాటేమిటి?

అధికారి : సారా ఎలా తయారు చేస్తారో తాగేవాళ్లు ముందు తెలుసుకోవాలి. అడవుల్లో తుమ్మచెట్టు బెరడు, మహువా చెట్ల విప్ప పూలు, కాలిన పాదరక్షలు చెప్పులు, సంచులు, మిథనాల్ ఆల్కహాల్ వంటివి బెల్లం ఊటతో కలిపి సారా కాస్తారు. అలాంటి హానికర సారా తాగి కండ్లలో ఆప్టిక్ నెర్వ్ దెబ్బతిని, లివర్ పాడై, ఊపిరితిత్తులు ఛిద్రమై ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. ఇప్పుడు జిల్లాలో క్రయ విక్రయాలు బాగా తగ్గాయి. 2023లో ఈ ఐదు నెలల్లోనే 445 కేసులు కట్టి 468 మందిని అరెస్టు చేశాం. కానీ ఇప్పటికీ కొంతమంది కావిడి బద్దలతో పొలంగట్ల వెంబడి మూటల్లో తీసుకుపోతున్నారు.

సాక్షి: పక్క రాష్ట్రం ఒడిశాలో లైసెన్సు ఉంది కదా.. అక్కడ రేటు ఎలా నిర్ణయిస్తారు?

అధికారి : అక్కడ లీటరు రూ. 50 ఉంటుంది, అమ్మేప్పుడు రూ. 80కి అమ్ముతారు. మన ప్రాంతాలకు తెచ్చేవారు అధిక రేటుకు అమ్ముతారు. రాత్రి పూట నిఘాలో 2100 ప్యాకెట్లు (210 లీటర్లు) ద్విచక్రవాహనదారులు, కావిడలు మోసుకుని పోతున్నవారిని పట్టుకున్నాం. బెల్టుషాపులు రన్ చేసేవారిపై 330 కేసులు కట్టి 331 మందిని అరెస్టు చేశాం. 1156 లీటర్లు, 114 బళ్లు స్వాధీనం చేసుకున్నాం. ఒడిశా పోలీసులతో కలిసి దుర్గం, ఏక్మారలో జనవరిలో 45,120 లీటర్లు సారాయి ధ్వంసం చేశాం. నవంబరులో 4000 లీటర్లు ధ్వంసం చేశాం.

సాక్షి: సామాన్యులు ఫిర్యాదు చేయాలంటే ఎలా?

అధికారి : టోల్‌ఫ్రీ నంబర్ 14500కి సమాచార మిస్తే (వివరాలు గోప్యంగా ఉంచుతాం) మేం చర్యలు తీసుకుంటాం. కింతలి, జీఎన్‌పేట (పెదకొంగరాం), తోటాడ, కనిమెట్ట, శ్రీకాకుళం పెదమార్కెట్టు, కళాశాలలు, దమ్మలవీధి, రెల్లివీధి, 80ఫీట్‌రోడ్డు పొన్నాడ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో నిఘా పెడతాం.

సాక్షి : సారా నియంత్రణపై మీ ప్రణాళిక ఏమిటి?

అధికారి : ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి చెక్‌పోస్టులపై నిత్యం నిఘా పెట్టాం. వందలాదిగా కేసులు నమోదు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా స్కిల్ డ్రైవ్, నెహ్రూ యువ కేంద్రం తదితర వాటికి 20 మందిని రిఫర్ చేశాం.

సాక్షి : గ్యాంబ్లింగ్, ఇసుక తరలింపు వంటి అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

అధికారి : 2023లో గ్యాంబ్లింగ్‌పై 118 కేసులు (ఒక్క మే నెలలోనే 27 కేసులు), అక్రమ ఇసుక తరలింపుపై 109 కేసులు లాఅండ్‌ఆర్డర్ పోలీసులతో రిజిస్టర్ చేయించాం. దాడులు కలిపి చేసినా ఫైన్ వారితోనే వేయిస్తాం. ఇసుక అయితే మైన్స్ వాళ్లు నిర్ధారించాక పోలీసులు ఫైన్ వేస్తారు. బెట్టింగ్‌కు పాల్పడేవారికి ఇదే వర్తిస్తుంది.

సాక్షి: యువతకు మీరిచ్చే సందేశం?

అధికారి : ఒక్కసారి క్రిమినల్ రికార్డుల్లో పేరు నమోదైతే భవిష్యత్ పోతుందని యువత తెలుసుకోవాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పిల్లలతో రోజులో కనీసం రెండు గంటలైనా వెచ్చించాలి. వారి దినచర్యలో ఏం చేస్తున్నారు, ఎక్కడెక్కడికి వెళ్తున్నారన్నది ఓ కన్నేయాలి.

మత్స్యకారులకు రక్షణ అవసరం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సాగర మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో ఆత్మరక్షణ కోసం తప్పనిసరిగా మెలకువలు పాటించాలని మత్స్యశాఖ సహాయ సంచాలకులు టి.సంతోష్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో పశుసంవర్ధకశాఖ సమావేశ మందిరంలో సాగర మత్స్యకారులకు బీచ్‌లైఫ్ గార్డు, లైఫ్ సపోర్ట్ అనే శిక్షణ కార్యక్రమం మూడు రోజులు పాటు జరిగింది. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ప్రమాద సమయంలో పాటించాల్సిన ప్రథమ చికిత్స, ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడే వివిధ పద్ధతులను మత్స్యకారులకు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వై.సత్యనారాయణ, సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.